క్లుప్తంగా

పొగాకు వాడకంతో అనారోగ్యం

నారాయణఖేడ్: పొగాకు నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని సూచించారు. ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం ఖేడ్‌లోని కోర్టు ఆవరణలో కక్షిదారులతో ఆయన మాట్లాడారు. ధూమపానం, పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మారుతిరెడ్డి, సాయిలు, సుధాకర్, శివ శంకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి



వైద్య సిబ్బందితో మాట్లడుతున్న సంగారెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం కల్హేర్‌లోని సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. వైద్య సేవలు, ప్రసవల గురించి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కోవిడ్, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనిల్‌రెడ్డి, జెబ, సిబ్బంది మానిక్యాం, బాలమణి పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: గోవుల అక్రమ రవాణాను నిరోధించాలని శనివారం విశ్వహిందుపరిషత్, బజరంగ్ దళ్ సంఘాల బాధ్యులు ఇన్‌చార్జి తహసీల్దార్ రాజుపటేల్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణా పెరిగే అవకాశం ఉన్నందున నిఘాతో అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు అశోక్ యాదవ్, కురుమ దశరథ్‌యాదవ్, రాజశేఖర్ గౌడ్, పట్నం మాణిక్, గొలిశుభం, సాయేందర్, వంశీరెడ్డి ఉన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేయనున్నట్లు సిర్గాపూర్ ఎంపీడీఓ మల్సూర్ నాయక్ తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండల పరిషత్తులో ఉపాధి హామీ తనిఖీ బృందం, పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో కోర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి మండలంలో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ రాజు, ఏపీఓ బస్వరాజ్ పాల్గొన్నారు.

శాంతియుతంగా పండగలు జరుపుకోవాలి

డీఎస్పీ సైదా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సైదా

జహీరాబాద్ టౌన్: బక్రీద్ పండగను ముస్లింలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ సైదా పేర్కొన్నారు. పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు సంతలో క్రయవిక్రయాలు జరుపుకోవాలన్నారు. ఆవులు, లేగ దూడలను క్రయవిక్రయాలు చేపట్టొదని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దశరథ్, జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్ ముస్లిం మైనార్టీ, ఎంఐఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి క్రైమ్: పట్టణ ప్రజలు పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సత్తయ్య సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతి సమావేశానికి హిందూ, ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. డీఎస్పీ సత్తయ్య మాట్లాడుతూ...ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తప్పకుండా అన్ని మతాలవారు పోలీసులకు సహకరించాలని కోరారు.

రేషన్.. పరేషాన్..!



రేషన్ కోసం కొన్యాల గ్రామానికి వెళ్తున్న మధుర గ్రామస్తులు

ఇతర గ్రామాలకు నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి

- ఇబ్బంది పడుతున్న ఎనిమిది గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హత్నూర(సంగారెడ్డి): సాంకేతిక పరిజ్ఞానం పెంపొందిన ప్రస్తుత రోజుల్లో చాలా గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేక పోవడం గమనార్హం. హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో నేటికి రేషన్ దుకాణాలు లేకపోవడంతో ప్రజలు ఇతర గ్రామాలకు నడిచి వెళ్లి ప్రతి నెల రేషన్ తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 38 గ్రామపంచాయతీలు ఉన్నప్పటికీ 38 రేషన్ దుకాణాలు ఉన్నాయి. కొన్ని పెద్ద గ్రామాల్లో రెండు మూడు రేషన్ దుకాణాలు కూడా ఉన్నాయి. మండలంలోని నూతనంగా ఏర్పడిన మాధుర గ్రామ పంచాయతీకి చెందిన రేషన్ లబ్ధిదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొన్యాల గ్రామానికి నడిచి వెళ్లి ప్రతినెల రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొడిపాక గ్రామస్తులు నాగారం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. బడంపేట గ్రామస్తులు పన్నాలకు వెళ్లి తెచ్చుకోవాలి. రేండ్లగూడ గ్రామస్తులు ఎల్లమ్మ గూడా గ్రామానికి ప్రతినెల వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నేటికీ ఉన్నాయి. బీమ్లా తండా, తెల్ల తండా నూతన గ్రామపంచాయతీ ప్రజలు సిరిపుర వెళ్లి రేషన్ తీసుకుంటున్నారు. అకంచగూడ గ్రామస్తులు రొయ్యపల్లి, రెడ్డిపాలెం గ్రామస్తులు చింతల్ చెరువు గ్రామాలకు ప్రతినెల వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన దుస్థితి. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 8 గ్రామాల ప్రజలు రేషన్ దుకాణాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చలేదు..

ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి పోటీ చేసే నాయకులు సైతం ఈ గ్రామాలకు వచ్చినప్పుడు రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు.. నేటికీ సమస్యను పరిష్కరించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి తమ గ్రామాలకు రేషన్ దుకాణాలు మంజూరు చేసి గ్రామంలోనే రేషన్ ఇప్పించాలని కోరుతున్నారు.

గ్రామంలోనే ఏర్పాటు చేయాలి



రేషన్ దుకాణం గ్రామంలోనే ఏర్పాటు చేయాలి, ప్రతినెల బియ్యం కోసం కొన్యాల నడిచి వెళ్తున్నాం.. ఇబ్బందిగా ఉంది. జ్వరం వచ్చి చేతకాక పోతే రేషన్ తీసుకోవడానికి వెళ్లడం లేదు. గ్రామంలో రేషన్ దుకాణం ఉంటే ఇబ్బంది లేకుండా బియ్యం తెచ్చుకుంటాం.

– శ్రీహరి మధుర

ప్రభుత్వం మంజూరు చేయాలి



ప్రభుత్వం నూతనంగా రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలి. అప్పుడు మాత్రమే ఆయా గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. రేషన్ దుకాణాలు లేని విషయం జిల్లాస్థాయి అధికారులకు నివేదిక సైతం ఇచ్చాం. రేషన్ షాపులు మంజూరు చేస్తే వెంటనే ఏర్పాటు ఇస్తాం.

– పర్వీన్ షేక్, తహసీల్దార్ హత్నూర

3 నుంచి భూభారతి సదస్సులు

తహసీల్దార్ భాస్కర్



కంగ్టి(నారాయణఖేడ్): భూ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతిలో రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఈ నెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కంగ్టి మండల తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. మండలంలోని 26 రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ బృందం, డిప్యూటీ తహసీల్దార్ బృందంగా రెండు టీంలుగా ఏర్పడి సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు టీంలలో గిర్దవార్, సర్వేయర్, డాటా ఆపరేటర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, వీఆర్ఏలు ఉంటారని తెలిపారు. ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకు గ్రామ పంచాయతీ భవనంలో ఉంటారని తెలిపారు. జమ్గి(బీ)లో పాఠశాలలో, చాప్టా(కే)లో చావిడిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3న జమ్గి(బీ), దెగుల్‌వాడి 4న జమ్గి(కే), భీంరా, 5న ఎంపల్లి, నాగుర్(కే) 6న వల్మూర్, నాగుర్(బీ), 9న బాన్సువాడ, సిద్దంగిర్గా, 10న దామర్‌గిద్దా, ఎన్కెమూరి, 11న ఘన్‌పూర్, రాంతీర్థ్, 12న రాసోల్, నాగన్‌పల్లి, 13న ముర్కుంజాల్, గాజుల్‌పాడ్, 16న చాప్టా(కే), సుక్కల్‌తీర్థ్, 17న చాప్టా(బీ), తుర్కవడ్‌గాం 18న బోర్గి, కంగ్టి 19న చౌకన్‌పల్లి 20న తడ్కల్‌లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూసార పరిరక్షణపై దృష్టి సారించాలి

ఆత్మ కమిటీ చైర్మన్ కరూర్‌రావు



విత్తన బస్తాను అందజేస్తున్న చైర్మన్లు, అధికారులు

రాయికోడ్(అందోల్): భూసార పరిరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకమిటీ చైర్మన్ కరూర్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఏఓసారిక, సొసైటీ చైర్మన్‌తో కలిసి శనివారం రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు. 40 కిలోల జనుము విత్తన బస్తాను రూ.2,510లకు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల వినియోగంలో అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు అవలంబించి పెట్టుబడులు తగ్గించుకుని అధిక పంట దిగుబడులు పొందాలని ఆకాంక్షించారు. ఏఓ సారిక మాట్లాడుతూ.. జనుము విత్తనాలు వేసిన 20 నుంచి 25 రోజుల మధ్య దున్నుకోవాలన్నారు. జనుము పూతకు రాకముందు దున్నేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. సాగులో 50 శాతం యూరియాను మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగిశెట్టి, ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.నర్సింలు, ఏఈఓలు కల్పన, నికిలేష్, రైతులు ఉన్నారు.

వికసిత్ కృషితో రైతులు అభివృద్ధి

కంగ్టి(నారాయణఖేడ్): వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ పథకంతో రైతులు అభివృద్ధి చెందాలని వ్యవసాయ, అనుబంధ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్తలు మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయి ప్రియాంక మాట్లాడుతూ.. అభియాన్ ప్రాముఖ్యత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి రైతులకు వివరించారు. పీఎం కిసాన్ యోజన, రైతు భరోసా, పీఎం ఫసల్ బీమా, వ్యవసాయ పరికరాల సబ్సిడీల అంశాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ శాస్త్రవేత్త అరుణ మాట్లాడుతూ.. జొన్న పంటల్లో పునరుద్ధరించిన రకాలు, సాగు పద్ధతులపై వివరించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్త డాక్టర్ స్నేహలత సమగ్ర తెగుళ్ల నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువైద్య శాస్త్ర వేత్త డాక్టర్ క్రైస్ పశువుల్లో డివార్మింగ్, టీకాల ప్రాముఖ్యత, పశుసంరక్షణ పద్ధతులు వివరించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

నారాయణఖేడ్: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌గా గుర్తింపు పొందిన నియోప్రగతి పాఠశాలలో 2025– 26 విద్యా సంవత్సరంలో మొదటి తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలకు ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తులను జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో జూన్ 13లోగా సమర్పించాలని, లేదా దరఖాస్తులను తమ పాఠశాలలో అందిస్తే కలెక్టర్ కార్యాలయంలో తాము సమర్పిస్తామని తెలిపారు.

బోరు మోటారు ఏర్పాటు

నారాయణఖేడ్: మండలం పరిధివెంకటాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ రూ.3 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో బోరు డ్రిల్లింగ్, మోటారు అమర్చడం, పైపులైను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు చేసినందుకు ఎంపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బువ్వ బండి ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాకులు సత్తయ్య ఆధ్వర్యంలో శనివారం తెల్లాపూర్ గద్దర్ చౌరస్తాలో బువ్వ బండిని ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా హాజరయిన నీలం మధు మాట్లాడుతూ.. కార్మిక నాయకులు కొల్లూరి సత్తయ్య నిరుపేదలకు పౌష్టిక ఆహారం అందించాలన్న లక్ష్యంతో బువ్వ బండిని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నిత్యం ఉచితంగా 400మందికి మిల్లెట్స్ ఆహారం అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్, కాంగ్రెస్ నాయకులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌గౌడ్, రవి, శ్రీను, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సింగూరు పంచాయతీ కార్యదర్శిగా ప్రమోద్

పుల్‌కల్(అందోల్): మండలంలోని సింగూరు పంచాయతీ కార్యదర్శిగా ప్రమోద్ బాధ్యతలు స్వీకరించారు. సింగూరు పంచాయతీ కార్య దర్శి రంగయ్య అవినీతి ఆరోపణలతో సస్పెండ్ కావడంతో అతని స్థానంలో ప్రమోద్‌ను నియమించారు.

◆ సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని 33 మంది లబ్ధిదారులకు రూ.906000 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంకు చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు నాయకులు సుధీర్‌రెడ్డి, లలిత పాల్గొన్నారు,

◆ ప్రేమ వివాహానికి అంగీకారం

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి పాటి గ్రామానికి చెందిన నిఖిత(23), పటాన్ చెరుకు చెందిన అభినందన్(25) ప్రేమ వివాహం చేసుకున్నారు. శనివారం ఇరువురి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కావాలని పటాన్‌చెరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ వినాయక్‌రెడ్డి ఇరువురి కుటుంబ సభ్యులను స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. దీంతో ఇరువురి కుటుంబ సభ్యులు వారి వివాహాన్ని అంగీకరించారు.

◆ అన్ని రకాల కమ్యూనిటీ భవనాలకు కృషి

సంగారెడ్డి టౌన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాల కమ్యూనిటీ భవనాలకు కృషి చేసిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట్‌లో పద్మశాలి సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్గిపెట్టెలో చీరలు నేసి, రాజులను మెప్పించిన చరిత్ర ఉందన్నారు. అనంతరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రఘు, సుధీర్ రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుల ప్రాణాలతో చెలగాటం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని డెక్కన్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యజమాన్యం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలో ఓ షెడ్డు నిర్మాణం చేపడుతూ అనుభవం లేని కార్మికులతో చాలా ఎత్తులో భద్రతా ప్రమాణాలు తీసుకోకుండా పనులను చేయిస్తోందని స్థానికులు వాపోతున్నారు. నిర్మాణ సమయంలో అనుకోకుండా జరిగే ప్రమాదానికి బాధ్యత వహించేది ఎవరని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇలాంటి షెడ్ల నిర్మాణం చేసే సమయంలో కిందపడి కార్మికులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమ యజమాన్యంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ ఉత్తమ సేవలందించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరని, ఉద్యోగంలో ఉన్నంత కాలం ప్రజలకు ఉత్తమ సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, మాజీ వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, న్యాల్‌కల్, హద్నూర్ పీఏసీఎస్ చైర్మన్లు సిద్దిలింగయ్యస్వామి, జగనాథ్‌రెడ్డి నాయకులు రఫీయోద్దీన్, శాంత్‌కుమార్ పాటిల్ పాల్గొన్నారు.

◆ 90 లక్షల ఖాతాదారులకు సేవలు

నారాయణఖేడ్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంకు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఖేడ్ బ్రాంచ్ శాఖను శనివారం నూతన భవనంలోకి మార్చారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొన్నారు. బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ.. తమబ్యాంకు రూ.73,823 కోట్ల వ్యాపారాన్ని కలిగి ఉండి గత మార్చి 31 నాటికి రూ.675 కోట్ల నికర లాభాన్ని అర్జించి రూ.8, 374 కోట్ల రిజర్వులతో పటిష్టంగా ఉందన్నారు.



ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న గిరిధర్‌రెడ్డి, జానకిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం



ఇళ్ల పనులు ప్రారంభించిన యాదగిరి



గొంగ్లూర్‌లో మార్కింగ్ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని ఫసల్వాది గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మాణానికి కావాల్సిన వస్తువులను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొంగ్లూర్, ఇసోజీపేటలో..

పుల్‌కల్(అందోల్): మండలంలోని గొంగ్లూర్, ఇసోజీపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు శనివారం అధికారులు మార్కింగ్ చేశారు. ఏడాది నుంచి ఊరిస్తూ వచ్చిన అధికారులు వర్షాకాలం సీజన్ మార్కింగ్ ఇస్తే ఎలా? అని లబ్ధిదారులు ప్రశ్నించారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో ఇళ్లు నిర్మించుకోవడం కష్టమని అంటున్నారు. ఇసుక, కంకర, రాయి వానాకాలంలో రెట్టింపు ధరలు ఉంటాయని వాపోతున్నారు.

కేరూర్ గ్రామంలో..

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీఓ అంజయ్య ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసుకోవాలన్నారు. దశల వారీగా ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పాపయ్య, హౌసింగ్ ఏఈ శివాణి, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో..

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. శివనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చరణ్, మాజీ ఎంపీటీసీ బత్తుల సంతోషి మహేశ్ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. గుమ్మడిదల మండలంలో కానుకుంట, నల్లవల్లి గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు.

అనేగుంట గ్రామంలో..

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంట గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన పనులకు ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను కట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ధూమపానంతో అనారోగ్య సమస్యలు

జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి



పొగాకు వాడకంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి : ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి సూచించారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు కోటి మంది పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందన్నారు. సిగరెట్ తాగడం వల్ల గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో పాటు క్యాన్సర్, డయాబెటిస్, ఆస్టియోపొరోసిస్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. మే 31న వరల్డ్ నో టొబాకో డే'ను నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కమ్ సెక్రటరీ డీవీఆర్ తేజ్ కార్తీక్ మాట్లాడుతూ.. సమాజంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, అన్ని పాఠశాలలు , స్వచ్ఛందగా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి ధూమపానం వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మహేందర్‌రెడ్డి, డాక్టర్ శశాంక్ దేశపాండే, డాక్టర్ శశికర్, డాక్టర్ వరలక్ష్మి, విష్ణు వర్ధన్ రెడ్డి ఇంద్రనగర్, ఆరోగ్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

సంగారెడ్డి టౌన్ : పొగాకుకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి జడ్జి కష్టార్జున అన్నారు. పొగాకు సేవించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో పొగాకు వ్యతిరేక దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయవాదులు, కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలున్నా ఉపాధి దక్కడం లేదు


ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



సమావేశంలో మాట్లాడుతున్న నరోత్తం

జహీరాబాద్: నియోజకవర్గంలో యాభై పరిశ్రమలున్నా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్‌లోని మహీంద్ర, దిగ్వాల్‌లోని పిరామిల్, కవేలిలోని రాల్‌ఫూల్‌తో పాటు వీఎస్టీ, గిరిధర్ ఎక్స్ ప్లోజివ్, హట్‌సన్ కర్మాగారాలున్నా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కని పరిస్థితి ఉందన్నారు. పరిశ్రమల కోసం ప్రభుత్వం అనేక రాయితీలను ఇస్తోందన్నారు. తక్కువ ధరకు భూములు పొందుతున్నారని, నీరు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారని, కనీస సదుపాయలు కల్పిస్తున్నా యాజమాన్యాలు మాత్రం ఉపాధి అవకాశాలు కల్పించకుండా స్థానిక యువతను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అయినా నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమల్లో ఎక్కడ కూడా స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. దీంతో నిరుద్యోగులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమల కాలుష్యంతో తాగడానికి నీరు లభించని పరిస్థితి నెలకొందని విమర్శించారు. గోవింద్‌పూర్‌లోని హట్సన్ కర్మాగారంలో డైరీకి సంబంధించిన ఉత్పత్తులు తయారవుతున్నాయి.. ఇక్కడి రైతు ల వద్ద నుంచి పాలు కొనుగోలు చేయకుండా ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకుంటుందని మండిపడ్డారు.

కొనసాగిన కూల్చివేతలు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

పటాన్‌చెరు: ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శెట్టికుంటలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కూల్చివేతలు చేసిన విషయం తెలిసిందే. రెండో రోజూ శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వ సర్వే నంబర్ 1112తో పాటు సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబర్ 457/2లో భూదాన్ ల్యాండ్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు.